

శ్రీరాంసాగర్‌కు బాబ్లీ జలాలు.. 2



భర్తను హతమార్చిన భార్య 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## రికార్డు అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలి



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా రికార్డ్ అసిస్టెంట్లకు పదోన్నతులు లేవన్నారు. అదే పోస్టులోనే పదవీ విరమణ చేస్తూ సర్వీసులో చాలా నష్టపోతున్నారని వాపోయారు. సీఈవోకు వినతిపత్రం అందించిన వారిలో సంఘం ఉపాధ్యక్షులు సైఫ్ అలీ, ప్రధాన కార్యదర్శి గోపి, కోశాధికారి శ్రీనివాస్ ఉన్నారు.



## భారీగా ఎస్సైల బదిలీ

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో భారీగా ఎస్సైలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాసర జోన్ పరిధిలో మొత్తం 14 మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో వీఆర్‌లో ఉన్న ఏడుగురికి స్టేషన్లలో పోస్టింగ్ ఇచ్చారు. మామిడిపల్లి కల్యాణిని సిరికొండ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. సీహెచ్ సుమలతను మోపాల్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ముత్యాల రమను ఎస్‌హెచ్‌వోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కావల్ల శైలేందర్‌ను బాల్కొండ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు.

జాదవ్ సుహాసినిని మెండోరా ఎస్‌హెచ్‌వోగా నియమించారు. పడాల రాజేశ్వర్‌ను ఏర్గట్ల ఎస్‌హెచ్‌వోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కలమడుగు కిరణ్ పాల్‌ను నిజామాబాద్ మూడో టౌన్ సెకండ్ ఎస్సైగా నియమించారు. సిరికొండ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న ఎల్.రామ్‌ను నిజామాబాద్ వీఆర్‌కు అటాచ్ చేశారు. మోపాల్ ఎస్‌హెచ్‌వో సి.యాదగిరిని నిజామాబాద్ వీఆర్‌కు పంపించారు. అలాగే ఎడపల్లి ఎస్‌హెచ్‌వో వంశీ కృష్ణను నిజామాబాద్ వీఆర్‌కు పంపించారు. బాల్కొండ ఎస్‌హెచ్‌వో నరేశ్‌ను ఆదిలాబాద్ వీఆర్‌కు అటాచ్ చేశారు. మెండోరా ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్‌ను నిజామాబాద్ వీఆర్‌కు పంపించారు. ఏర్గట్ల ఎస్‌హెచ్‌వో బి.రామును నిజామాబాద్ వీఆర్‌కు పంపించారు. అంతేకాకుండా మోర్తాడ్ ఎస్‌హెచ్‌వో విక్రమ్‌ను ఆదిలాబాద్ వీఆర్‌కు అటాచ్ చేశారు. కాగా.. కామారెడ్డి జిల్లాలోనూ పది మంది ఎస్సైలను ఇటీవల బదిలీ చేసిన విషయం తెలిసిందే.

## భూ భారతి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** భూభారతిలో భాగంగా రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. శనివారం పెద్ద కొడప్‌గల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు.

### 152 మందికి నోటీసులు..

రెవెన్యూ సదస్సులలో 499 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, వాటిలో 152 మందికి నోటీసులు అందజేశామని, మిగిలిన వాటిలో చాలావరకు అటవీశాఖకు చెందిన దరఖాస్తులే వచ్చాయని ఆమె తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దార్ దశరథ్, నాయబ్ తహశీల్దార్ రవికాంత్, ఆర్ఐ అంజన్న, సిబ్బంది ఉన్నారు.




కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

**అక్షరటుడే, నిజాంసాగర్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన తన నివాసంలో ఉమ్మడి జిల్లాల మాజీ జడ్పీ ఛైర్మన్ దఫేదార్ రాజు, నిజామాబాద్ జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ముజీబొద్దీన్ శనివారం కలిశారు. ముందుగా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి కేటీఆర్ ను అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా కేటీఆర్ వారితో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించినట్లు తెలిపారు.

# డెంగీ ముప్పు..

వర్షా కాలం వచ్చిందంటే చాలు సీజనల్ వ్యాధులు ముసురుకుంటాయి. మరీ ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలువురు డెంగీ భారిన పడ్డారు. గత నెలలో సుమారు 40 మందికి డెంగీ వచ్చింది. ఆస్పత్రుల్లోనూ అనుమానితుల సంఖ్య పెరగడంతో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.
- అక్షరటుడే, ఇందూరు



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులతో పాటు పీహెచ్‌సీలలో జ్వర బాధితులు పెరుగుతున్నారు. శనివారం నిజామాబాద్ జీజీహెచ్‌లో వెయ్యికి పైగా ఓపీ నమోదైంది. ఇందులో ఎక్కువ శాతం జ్వరంతో బాధపడే వారే ఉన్నారు. దీంతో వైద్యులు మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలకు రిఫర్ చేస్తున్నారు. అలాగే ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ రోగుల సంఖ్య పెరగడంతో టెస్టుల పేరుతో అందిన కాడికి దండుకుంటున్నారు.

■ నిజాంసాగర్ మండలం వడ్డేపల్లిలో 14 ఏళ్ల బాలుడికి శనివారం డెంగీ నిర్ధారణ అయింది. గత పది రోజులుగా తీవ్ర జ్వరం రావడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు పరీక్షలు చేయించారు. డెంగీ సోకినట్లు గుర్తించారు. దీంతో శనివారం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

▸ ప్రారంభమైన వర్షా కాలం సీజన్ ▸ ఉమ్మడి జిల్లాలో నమోదవుతున్న కేసులు
▸ జ్వరాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు ▸ జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన

జులైలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితి

| జిల్లా | అనుమానితుల | పాజిటివ్ |
|---|---|---|
| కామారెడ్డి | 03 | 01 |
| నిజామాబాద్ | 05. | 00 |

డెంగీ హిమరేజిక్ ఫీవర్. దీని ప్రారంభ లక్షణాలు సాధారణ జ్వరం మాదిరిగానే ఉంటాయి. ఆ తర్వాత తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, దద్దుర్లు వంటివి వస్తాయి. అదే సమయంలో తీవ్రమైన కడుపునొప్పి పదేపదే వాంతులు, చిగుళ్లు లేదా ముక్కు నుంచి రక్తస్రావం, రక్తంతో వాంతులు చేసుకోవడం, అకస్మాత్తుగా రక్తపోటు వంటి సమస్యలు తలెత్తుతాయి. L

### ప్రతి శుక్రవారం డ్రై డే..

వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అధికారులు సైతం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడటం, నివాస, దుకాణ సముదాయాల్లో పరిశుభ్రత పాటించడంపై ప్రజలకు సూచనలు చేస్తున్నారు. పాత వస్తువులు, వ్యర్థాలు లేకుండా చూస్తున్నారు. అయితే గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నా పట్టణాలు, నగరాల్లో మాత్రం కాస్త వెనుకబడ్డారు. ప్రధానంగా నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, బోధన్ లాంటి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు, స్లమ్ ఏరియాల్లో మాత్రం ఫ్రైడే, డ్రైడేపై అవగాహన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

### గత నెలలో భారీగానే..

గత నెలలో ఉమ్మడి జిల్లాలో భారీగానే డెంగీ కేసులు నమోదయ్యాయి. నిజామాబాదులో 25, కామారెడ్డిలో 14 మంది ఈ వ్యాధి బారినపడ్డారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు సూచిస్తున్నారు. కాగా.. ఈ నెలలో కామారెడ్డి జిల్లాలో ఒక కేసు నమోదైంది. వైరల్ ఫీవర్ బారిన పడిన వారి సంఖ్య సుమారు 200 వరకు ఉంటారు. అయితే వర్షాలు మొదలైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల కేసులు మరింత పెరిగే అవకాశం ఉంది.

### ఇలా చేస్తే మేలు..

దోమలను నియంత్రించడం ద్వారా డెంగీ వ్యాప్తిని నివారించవచ్చు. గుంతల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడడం ద్వారా దోమలను నియంత్రించే అవకాశం ఉంటుంది. అలాగే దోమల నుంచి రక్షించుకోవడానికి నిండుగా దుస్తులు ధరించాలి. ఎక్కడ పడితే అక్కడ చెత్తను పాడేయకుండా డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలి. ప్రధానంగా దోమల వృద్ధి చెందకుండా అప్రమత్తంగా ఉండడం ద్వారా డెంగీ సోకకుండా చూసుకోవచ్చు. జ్వరం లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.



## మంజీరలో ఇసుక ట్రాక్టర్ల క్యూ..

నిజామాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీనికనుగుణంగా ఇసుక అవసరాలు కూడా పెరిగాయి. పలు అభివృద్ధి పనులకు సైతం అధికారులు అనుమతులు ఇవ్వడంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీంతో మంజీరలో ఇసుక ట్రాక్టర్లు క్యూ కట్టాయి. శనివారం సుమారు 60 ట్రాక్టర్లలో ఇసుక నింపిన అనంతరం వేబిల్లుల కోసం ఇలా క్యూలో ఉన్నాయి. – అక్షరటుడే, కోటగిరి

## కళాశాలల మరమ్మతులకు రూ.3.23 కోట్లు మంజూరు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాల మరమ్మతులు, కనీస వసతుల కల్పనకు రూ. 3.23 కోట్లు విడుదలైనట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. జూనియర్ కళాశాలల బలోపేతం కోసం తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, కళాశాలలకు రంగులు, ఫర్నిచర్, బెంచీలు, బ్లాక్ బోర్డుల నిర్మాణానికి నిధులను వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

### కళాశాలలు.. నిధుల వివరాలు..

నిజామాబాద్ బాలికల కళాశాలకు రూ.30లక్షల నిధులు మంజూరయ్యాయి. అలాగే నిజామాబాద్ ఖిల్లా బాలుర కళాశాలకు రూ.56లక్షలు, డిచ్‌పల్లి రూ.14లక్షలు, మాక్లూర్ రూ.10 లక్షలు, మోర్తాడ్ రూ.26.35 లక్షలు, వర్ని రూ. 20.50 లక్షలు, బోధన్ రూ.10.70 లక్షలు విడుదలయ్యాయి. ఆర్మూర్ (బాలికలు) రూ.16 లక్షలు, ఆర్మూర్ (బాలురు) రూ.24 లక్షలు, భీమ్‌గల్ రూ.18 లక్షలు, ఐలాపూర్ రూ.9 లక్షలు, బాల్కొండ రూ.33.05 లక్షలు, ధర్పల్లి రూ.25 లక్షలు, కోటగిరి రూ.30.50లక్షల చొప్పున మంజూరయ్యాయి.



తేజస్విని పి.శ్రీవాణి సంజన

## ట్రిబుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు తోట నిక్షయ్, రాహుల్ బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వెంకట్ రాములు తెలిపారు. ఇద్దరు విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.
మండలం లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (IIIT) ఎన్నికైనట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం శోభారాణి తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం సంజన, పి శ్రీవాణి, వి తేజస్విని బాసర ట్రిబుల్ ఐటీ కి ఎంపిక కాగా.. ఈ మేరకు విద్యార్థినులకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



నిక్షయ్ రాహుల్

## లింబాద్రిగుట్టకు పోటెత్తిన భక్తజనం

**అక్షరటుడే, భీమ్‌గల్:** లింబాద్రి గుట్ట శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీమన్నింబాచల క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు క్యూకట్టారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ఈనెల 6 నుంచి చతుర్మాస్య వ్రతం ప్రారంభమవుతున్న నేపథ్యంలో భక్తులు శ్రీవారికి నివేదన, నైవేద్యాలను సమర్పించరాదని పూజారులు వివరించారు.



## అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. నిధులు దుర్వినియోగం అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించాలన్నారు.

### గ్రామసమస్యల పరిష్కారానికి కార్యాచరణ..

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఈనెల నుంచి కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ప్రతినెలా చివరి శనివారం పౌర హక్కుల దినం నిర్వహించి, తహశీల్దార్, పోలీస్ అధికారి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు నీలాదేవి, శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని మాలపల్లి ముజాహిద్ నగర్‌కు చెందిన అబీబా కౌసర్ కుటుంబానికి శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఎల్ఓసీ అందజేశారు. హబీబా కౌసర్ క్యాన్సర్‌తో బాధపడుతూ మెరుగైన చికిత్స కోసం అర్బన్ ఎమ్మెల్యేని సంప్రదించారు. ఈ నేపథ్యంలో సీఎం సహాయ నిధికి సిఫార్సు చేయగా రూ.4 లక్షలు ఎల్‌వోసీ మంజూరైంది.

## ఫోన్లను అశ్రద్ధ చేస్తే వ్యక్తిగత భద్రతకు భంగం


**అక్షరటుడే, కామారెడ్డి:** ఫోన్లను అశ్రద్ధ చేస్తే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం ఏర్పడుతుందని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. పట్టణంలో శనివారం పోలీస్ కార్యాలయంలో మాట్లాడారు. బాధితులు పోగొట్టుకున్న సుమారు 130 ఫోన్లను రికవరీ చేశామని.. త్వరలోనే బాధితులకు అప్పగిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం మనం ఉపయోగించే మొబైల్ ఫోన్లపై అశ్రద్ధ మంచిది కాదన్నారు. మొబైల్ రికవరీలలో రాష్ట్రంలోని మిషనరేట్లను మినహాయిస్తే జిల్లాలలో కామారెడ్డి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

### ఫోన్ చోరీకి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి

మొబైల్ పోయినా.. చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇవ్వాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. 15 రోజుల్లో ఈ టీం 130 ఫోన్లను రికవరీ చేశారన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబర్చిన టీం సభ్యులను ఎస్పీ అభినందించారు. రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు అందజేస్తామని, బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి సంబంధిత వివరాలు చూపించి ఫోన్లు తీసుకుని వెళ్లాలని సూచించారు.



## అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై పీడీయాక్ట్




**అక్షరటుడే, కామారెడ్డి:** దారిదోపిడీలు, చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై ఎస్పీ రాజేష్ చంద్ర ఉక్కుపాదం మోపారు. ముఠాలో ఉన్న నలుగురు సభ్యులపై పీడీయాక్ట్ నమోదు చేశారు. నిజామాబాద్ జిల్లా జైలులో ఉన్న నిందితులు చోండా అలియాస్ కూలీ పవార్, జాకీ గుజ్జియా బోస్లే, హరీష్ పవార్ అలియాస్ హర్ష, అనురాగ్ రత్నప్ప బోస్లేలకు శనివారం పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. కామారెడ్డి, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల్లో ఈ ముఠా 9 దారి దోపిడీలు, చోరీలకు పాల్పడిందన్నారు.

### ఆగి ఉన్న వాహనాలపై దాడులు..


నిందితులు రోడ్డు పక్కన ఆగిఉన్న వాహనాలపై దాడిచేసి, వాహనాల అద్దాలు పగులగొట్టి వాహనదారులపై కత్తులతో దాడి చేసేవారని ఎస్పీ తెలిపారు. బెదిరించి వారి వద్ద నుంచి డబ్బులు, విలువైన వస్తువులను, మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లేవారని.. రోడ్డు పక్కన ఉండే ఇళ్లల్లో సైతం చోరీలకు పాల్పడేవారని పేర్కొన్నారు. నిందితుల నేరపూరిత చర్యల ద్వారా ప్రజలలో భయాందోళనలు కలుగజేస్తూ సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగజేస్తున్నారని తెలిపారు. దీంతో వీరిపై పీడీ యాక్టు ప్రయోగించడం జరిగిందన్నారు. ఈ యాక్టుతో నిందితులు ఒక ఏడాది పాటు జైలులో ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. తరచూ నేరాలకు పాల్పడుతూ సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగజేస్తే పూర్తిగా జైలు జీవితానికి పరిమితమయ్యే అవకాశం ఉందన్నారు.

## సమ్మెను జయప్రదం చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ, సీఐటీయూ, టీయూసీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఓమయ్య, సీఐటీయూ నాయకులు పెద్ది వెంకట రాములు, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన ట్రాఫిక్ కానిస్టేబుల్




**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నగరంలో విధి నిర్వహణలో ఉన్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ తన మనత్వాన్ని చాటాడు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం కంఠేశ్వర్ బైపాస్ సర్కిల్ వద్ద ఓ వ్యక్తి బీపీ తక్కువై, పెరాలసిస్‌తో రోడ్డుపై పడిపోయి గాయాలపాలయ్యాడు. దీంతో అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సంజీవ్ వెంటనే స్పందించి అతడికి సపర్యలు చేశారు. అందుబాటులో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడితో ప్రాథమిక చికిత్స చేయించి ఆయన సూచనతో అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గాయపడ్డ వ్యక్తికి సపర్యలు చేసి వైద్యసాయం అందేలా కృషి చేసిన కానిస్టేబుల్‌ను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎస్‌హెచ్‌వో ప్రసాద్ అభినందించారు.

## భర్త గొంతు కోసి హత్య చేసిన భార్య

**అక్షరటుడే, బోధన్:** మండలంలోని మినార్‌పల్లిలో దారుణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను భార్య గొంతు కోసి హత్య చేసింది. రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మినార్‌పల్లి గ్రామంలో దేశ్యానాయక్‌కు భార్య, కొడుకు ఉన్నారు. అయితే కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం రాత్రి దేశ్యానాయక్ ఇంట్లో నుంచి అరుపులు వినిపించగా స్థానికులు వెళ్లి పరిశీలించారు. అయితే అప్పటికే దేశ్యానాయక్ గాయాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే అతడిని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బోధన్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్యతో పాటు కుమారుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా.. హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## మనస్థాపంతో మహిళ బలవన్మరణం

**అక్షరటుడే, కోటగిరి:** అబార్షన్ అయిందనే మనస్థాపంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పోతంగల్ మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొడిచెర్ల గ్రామానికి చెందిన మచ్కూరి మహాదేవి(28) నాలుగు నెలల గర్భిణి. అయితే శిశువు అనారోగ్యం ఉండడంతో అబార్షన్ అయింది. అనంతరం ఆమె కొడిచెర్ల గ్రామంలో తండ్రి ఇంటికి వచ్చింది. కానీ అబార్షన్ జరిగిందనే మనస్థాపంతో మహాదేవి శుక్రవారం రాత్రి ఇంట్లోనే చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తండ్రి సింగరే సామ్రాట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాబ్లీ గేట్లు ఎత్తిన అనంతరం జలాలు శ్రీరాంసాగర్‌కు చేరుకున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 1న మహారాష్ట్రలోని బాబ్లీ గేట్లను తెలంగాణ, మహారాష్ట్ర ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా తెరిచారు. మొత్తం 14 గేట్లను ఎత్తగా 0.35 టీఎంసీల నీరు శ్రీరాం సాగర్‌కు వస్తోంది.

- అక్షరటుడే, ఆర్మూర్



# శ్రీరాంసాగర్‌కు బాబ్లీ జలాలు..

▪ జలాశయంలోకి 0.35 టీఎంసీల నీరు ▪ అక్టోబర్ 29 తేదీ వరకు తెరిచి ఉండనున్న గేట్లు

బాబ్లీ గేట్లు ఎత్తిన అనంతరం వరద సుమారు 80 కి.మీ దూరం ప్రయాణించి ఎస్సారెస్పీలో ఆ నీరు కలుస్తుంది. బాబ్లీ నుంచి కందకుర్తి, బాసర, నాలేశ్వర్, జీజీ నడ్కుడ మీదుగా 80 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. అక్టోబర్ 29వరకు బాబ్లీ గేట్లను తెరిచి ఉంచనున్నారు. గతేడాది బాబ్లీ ద్వారా 293 టీఎంసీల నీరు వచ్చినట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొత్త రవి తెలిపారు.

### 60 టీఎంసీలకు చేరగానే సాగుకు..

గతేడాది ఎస్సారెస్పీలోకి మొత్తం 293 టీఎంసీల వరద వచ్చింది. ఇందులో నుంచి 288 టీఎంసీల నీటిని కాకతీయ, లక్ష్మి, సరస్వతి, వరద కాలువ, గోదావరి ద్వారా విడుదల చేశారు. ప్రాజెక్టు పరిధిలోని 6,24,000 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందింది. వరద కాలువ ద్వారా మిడ్ మానేరు, లోయర్ మానేర్ డ్యామ్‌లకు నీరు తరలించారు.

ఈ ఏడాది ప్రాజెక్టులో నీటి నిల్వ 60 టీఎంసీలకు చేరగానే సాగునీటి విడుదల విషయమై ప్రణాళికలు రూపొందించనున్నారు. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 11.440 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం 17.974 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 5,477 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. వర్షాలు పడుతుండటం.. ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ఆశాజనకంగా ఉండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తుజాల్ పూర్‌లో వాలీబాల్ టోర్నీ ప్రారంభం



**అక్షరటుడే, కామారెడ్డి:** బీబీపేట మండలం తుజాల్ పూర్ గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా టోర్నీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ టోర్నీ రెండు రోజుల పాటు ఉంటుందన్నారు. విజేతలకు ఆదివారం బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. మొదటి బహుమతికి రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6వేలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం షేరి తుజాల్ పూర్ అధ్యక్షుడు తలారి ఉదయ్ కిరణ్, శేరిపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ దేవయ్య, బీజేపీ గ్రామ అధ్యక్షుడు స్వామి, వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్, రాజు, కిరణ్, సంతోష్, పరుశురాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ చారి, నర్సయ్య గ్రామస్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు తరలిరావాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలకు కార్యకర్తలు తరలిరావాలని మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా మహమ్మద్ నగర్ నుంచి పిట్లం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నాయకుడు లోక్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రమేష్ యాదవ్, కోరమండల్ సాయాగౌడ్, తోటరాజు, సిర్పపల్లి శంకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## డీవైఎస్‌వోను కలిసిన స్కేటింగ్ అసోసియేషన్

**అక్షరటుడే, ఇందూరు:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా యువజన క్రీడల అధికారి పవన్‌ను శనివారం జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావు, కార్యదర్శి రాంచందర్, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు

**అక్షరటుడే, నిజాంసాగర్:** పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజనీగేట్ వద్ద జాతీయ రహదారిపై శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే వారితో పాటు ఇతరులకు సైతం హాని కలుగుతుందని చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## విశ్వ బ్రాహ్మణులను ఆదుకోవాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** చేతివృత్తికి దూరమైన విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్ చారి కోరారు. శనివారం ఆర్మూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి తరలి వెళ్లారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పథకాలలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల అధ్యక్షుడు నూనె గంగాధర్, ఆర్మూర్ జనరల్ సెక్రెటరీ శ్రీరామ్ నర్సయ్య, విశ్వకర్మ యోజన అధ్యక్షుడు రాగి నరేష్, కళ్యాణ్ శ్రీకాంత్, నూనె మునాల్, తాడూరి నరేష్, సంతోష్, రవి, ప్రదీప్, నిఖిల్ పాల్గొన్నారు.

## ఆలిండియా బంజారా సేవా సంఘం మండల కార్యవర్గం



**అక్షరటుడే, లింగంపేట:** ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం లింగంపేట మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సురేందర్, ఎన్నికల అధికారి మోతి సింగ్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా దేవదాస్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా సర్వన్ నాయక్, ఉపాధ్యక్షులుగా చంద్రు నాయక్, భీమానాయక్, దేవ్ సింగ్ నాయక్, కోశాధికారిగా భానోత్ మోతీరాం నాయక్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా గోపాల్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా బాదావత్ నౌషా నాయక్, బలరాం నాయక్, విజయ్ కుమార్, రామావత్ పాండు, సలహాదారులుగా సురేష్, కిషన్, చంద్ర నాయక్ గోపాల్ ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దేవిదాస్ మాట్లాడుతూ.. బంజారా జాతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ సేవాలాల్ మహారాజ్, రామ్ రావ్ మహారాజ్ చూపిన మార్గంలో ముందుకు సాగుతామన్నారు.

## నిజాంసాగర్‌లో సెల్‌ఫోన్ల చోరీలు

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంలో సెల్ ఫోన్ల చోరీలు పెరుగుతున్నాయి. ప్రతి శనివారం మార్కెట్ ఉండడంతో, రద్దీగా ఉన్న సమయాల్లో తరచూ సెల్ ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. తాజాగా శనివారం మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కూరగాయలు కొనుగోలు చేస్తుండగా ఓ యువకుడు అతని జేబులో నుంచి సెల్ ఫోన్ చోరీ చేశాడు. వెంటనే అతను తేరుకొని దొంగను పట్టుకునే లోపే సెల్ ఫోను కిందపడేసి పారిపోయాడు. స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేసినా తప్పించుకున్నాడు. పోలీసులు గస్తీ పెంచి చోరీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## మట్కా ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

**అక్షరటుడే, ఆర్మూర్:** మట్కా ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కిట్ గ్రామానికి చెందిన మహమ్మద్ ఎజాస్, షేక్ అబిద్, మహమ్మద్ జాకీర్ కలిసి మహారాష్ట్రకు చెందిన గోల్ అనే వ్యక్తితో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్నట్లు గుర్తించారు. ఫోన్‌పేలో డబ్బులు పంపిస్తున్నట్లుగా గుర్తించి వారిని శనివారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 6వేల నగదు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఆన్‌లైన్‌లో మట్కా ఆడడం చట్టరీత్యా నేరమని.. ఆడినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రెండు లారీలు ఢీ: ఒకరి దుర్మరణం

**అక్షరటుడే, కామారెడ్డి:** రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి రామారెడ్డి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి సిద్దిపేట వెళ్లాల్సిన ఓ లారీ పొరపాటున రామారెడ్డి బైపాస్ వంతెన నుంచి సర్వీస్ రోడ్డులోకి దిగింది. వెంటనే తప్పుదారిలో వెళ్తున్నామని గుర్తించిన డ్రైవర్ బైపాస్ పైకి లారీని మళ్లించాడు. అదే సమయంలో వెనుక నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వేగంగా ఈ లారీని ఢీకొట్టింది. దీంతో హైదరాబాద్ వెళ్తున్న వెళ్తున్న లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన వ్యక్తిని మధ్యప్రదేశ్ కు చెందిన ఓంకారం పార్తీ(33) గా గుర్తించారు. గాయపడ్డ మరో ఇద్దరిని ప్రస్తుతం కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.